క్లుప్తంగా

హోమియో వైద్యశాల ప్రారంభం



వైద్యశాలలో జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: పట్టణంలోని దోర్నాల బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మమత హోమియో వైద్యశాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శనివారం ప్రారంభించారు. హోమియో వైద్యానికి రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. సీనియర్ హోమియో వైద్యులు ఓవీ రమణ, సీనియర్ పాత్రికేయులు ఓఏ మల్లిక్, సీపీఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

యర్రగొండపాలెం: మన బడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఎంఈవో పి.ఆంజనేయులు ఆదేశించారు. శనివారం మండలంలోని వాదంపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతు నాడు-నేడు పనులకు సంబంధించి రావాల్సిన నిధులు వచ్చాయని, పనులు చేపట్టడానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని, వెంటనే మిగిలిన పనులు పూర్తిచేయాలని ఆయన అన్నారు. విద్యార్థులు అందరూ యూనిఫాం వేసుకొని వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు ఎదురు శ్రీనివాసరెడ్డి

కొమరోలు: మండలంలోని ఇడమకల్లులో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి ఇడమకల్లు సొసైటీ ప్రెసిడెంట్, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ఎదురు శ్రీనివాసరెడ్డి శనివారం లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. దైవ కార్యక్రమానికి మరి కొంతమంది దాతలు ముందుకొచ్చి ఆలయ అభివృద్ధికి విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జై జవాన్ ఫౌండేషన్ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద జై జవాన్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఏటా వేసవిలో దాతలు చలివేంద్రం ఏర్పాటు చేయడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. జై జవాన్ ఫౌండేషన్ కోశాధికారి పూనూరు గురువారెడ్డి, సభ్యుడు రామ్‌భూపాల్, సుబేదార్ అన్నం జనార్దనరావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం పాండురంగ ప్రసాద్, నాగేశ్వరమ్మ

కొమరోలు: శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం పాండురంగప్రసాద్ కోరారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎంఎంఎస్ అధ్యక్షురాలు నాగేశ్వరమ్మలతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. నాగేశ్వరమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శనగ పంటకు మద్దతు ధర కల్పిస్తూ శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దళారుల వద్ద శనగలు అమ్ముకుని మోసపోవద్దని సూచించారు.

దంత సమస్యలపై అవగాహన

పెద్దదోర్నాల: నోటి ఆరోగ్య దినోత్సవంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యాధికారి డాక్టర్ కళా సంధ్య అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనూష, పాఠశాల ఉపాధ్యాయినులు, ఆరోగ్యమిత్ర రాంబాబు పాల్గొన్నారు.

వాల్మీకుల అభ్యున్నతికి సీఎం కృషి



ఎమ్మెల్సీ మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న జిల్లా వాల్మీకి సంఘ నాయకులు

పెద్దదోర్నాల: రాష్ట్రంలోని వాల్మీకుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిరంతరం పాటు పడుతున్నారని కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ అలంపూరి మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. శనివారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి దైవదర్శనం నిమిత్తం వెళ్తూ మార్గమధ్యంలోని మండల కేంద్రంలో జిల్లా వాల్మీకి సంఘం నాయకులతో మాట్లాడారు. రాష్ట్ర వాల్మీకి సంఘం చైర్మన్‌గా, ఇప్పుడు ఎమ్మెల్సీగా నన్ను ఎన్నుకొని వాల్మీకులపై ఉన్న అభిమానాన్ని ముఖ్యమంత్రికి చాటారన్నారు. వాల్మీకీలకు రాజకీయంగా ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. రానున్న రోజులల్లో చట్టసభల్లో వాల్మీకుల సమస్యలపై తన వాణి వినిపించి ఓబీసీ రిజర్వేషన్లపై మాట్లాడతానని తెలిపారు. మంత్రుల సహకారంలో వాల్మీకుల సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు. మండల కేంద్రంలోని వాల్మీకీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకీ కార్పొరేషన్ డైరెక్టర్ నలబోతుల కొండయ్య, అడ్వకేట్ భూపని కాశయ్య, బోగెం కాటంరాజు, బోగెం లక్ష్మయ్య, కన్నెగంటి శ్రీను, మీనిగ లక్షయ్య, మండ్లా వెంకటసుబ్బయ్య, మండ్లా వెంకటరంగయ్య, మండ్లా కాశీనాయుడు, నల్లబోతుల లాలాశ్రీను, నల్లభోతుల హరీష్, మండ్లా రమణయ్య మండ్లా రాములు, తదితరులు పాల్గొని ఎమ్మెల్సీ డాక్టర్ అలంపూరి మధుసూదనరెడ్డిని సత్కరించారు.

పేదల ఆరోగ్యానికి మెరుగైన చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ సునీతాబ్రహ్మారెడ్డి

ముండ్లమూరు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం మెరుగైన చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా 37 రకాల మందులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఆరోగ్య కేంద్రానికి నూతనంగా కిడ్నీ, లివర్ పరీక్షల కోసం అవసరమైన ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసి రోగులకు ఎప్పటికప్పుడు మెరుగైన సేవలందించాలన్నారు. ఇంటింటి ఆరోగ్య సేవలను వేగవంతం చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య కేంద్రం ముఖ ద్వారం ఏర్పాటు, రోగుల కోసం రెయిలింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైద్యాధికారి జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డీప్ బోర్ ప్రారంభం



డీప్‌బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ చిత్తూరి హారిక

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో డీప్‌బోర్‌ను సర్పంచ్ చిత్తూరి హారిక శనివారం ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా కాలనీలో ఏర్పాటు చేసిన డీప్‌బోరును ప్రారంభించి నీటిని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, చంద్రకాంత్‌నాయక్, పరుచూరి శీతారామయ్య, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, వార్డు సభ్యులు మూడుగుల వెంకటేశ్వరరెడ్డి(బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న డాక్టర్ సుష్మ

పొదిలి రూరల్: చిన్న పిల్లల్లో నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తానికొండ సుష్మ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం పొదిలి మండలం ఉప్పలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు అవగహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే నులి పురుగుల నివారించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కడుపునొప్పి, రక్తహీనత, బుద్ధి మాంద్యం, సోమరితనం వంటి వాటిని దరికి చేరనివ్వకుండా అల్బెండజోల్ మాత్రలు పని చేస్తాయని చెప్పారు. ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. మండలంలో 15,266 మంది పిల్లలు ఉండగా ఇప్పటికి 14,657 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు డాక్టర్ సుష్మ చెప్పారు. సూపర్‌వైజర్ నారు శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ గ్రామీణులకు వరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఖాదర్ మస్తాన్‌బీ

తాళ్లూరు: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ పథకం గ్రామీణులకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ ఖాదర్ మస్తాన్‌బీ అన్నారు. మన్నేపల్లిలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా గ్రామంలో మంచంలో ఉన్న పలురువు రోగులను పరిశీలించి వైద్య సలహాలు అందించారు. మంచంలో ఉన్న పుల్లారెడ్డిని పరిశీలించి రోజు మార్చి రోజు డ్రస్సింగ్ చేయించుకోవాలని చెప్పారు. చిరువ్యాధులకు రెగ్యులర్‌గా మెడిసిన్ వాడాలని సూచించారు. అవసరమైన మందులు అందించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓ బి.ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మంగాబాయ్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాధాన్యంపై అవగాహన



చిరుధాన్యాల గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త

దర్శి: ప్రకృతి వ్యవసాయంలో చిరుధాన్యాల ప్రాధాన్యంపై శిక్షణ కార్యక్రమం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణా మండలి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.సుబ్బారావు హాజరై చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తక్కువ ఖర్చుతో తక్కువ పెట్టుబడితో చిరుధాన్యాలు సాగు చేసుకోవచ్చని, చిరు ధాన్యాలు మన ఆహార అలవాట్లలో ఒక భాగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్రస్తుత మార్కెట్‌లో ఉన్న జంక్ ఫుడ్‌లకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తినాలని చెప్పారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.ఉషా, జాహ్నవి, బాలకృష్ణ, టి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



వేణుగోపాలస్వామి

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి శనివారం ప్రత్యేక పూజలు అర్చకులు పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. పాపావిమోచన ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోతర, సహస్రనామ పూజలు చేశారు. భక్తులు హాజరై పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంగమ్మ తల్లికి పూజలు



అలంకరణలో గంగమ్మతల్లి

కొనకనమిట్ల: వెలుగొండ సన్నిధిలోని గంగాభవాని అలయంతో పాటు బలిహోర గంగమ్మతల్లి ఆలయాల్లో శనివారం భక్తులు పూజలు చేశారు. వెలుగొండ శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం కమిటీ ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టారు. ముందుగా ఉత్సవం నిర్వహించి నైవేద్యాలు సమర్పించి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాదవ అన్నదాన సత్రం కమిటీ అధ్యక్షుడు సాదం వీరయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, కోశాధికారి పిన్నెక నాగేశ్వరరావు, ఈర్ల బాలవెంకటేశ్వర్లు, మోడి ఆంజనేయులు, లక్ష్మణ, గుమ్మా నాగార్జున, ఉప్పుటూరి కాశయ్య, అంకాల వెంకటేశ్వర్లు, బాలయ్య, కడెం అల్లూరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గంగమ్మతల్లికి పొంగళ్లు తెస్తున్న భక్తులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘ కార్యాలయం ఎదుట శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విశ్రాంత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారి మూలవిరాట్

మార్కాపురం టౌన్:భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి శనివారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, సహస్రనామార్చన పూజల అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి మేరిసారాదానమ్మ

గిద్దలూరు రూరల్: హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని సబ్‌జైలును, మండల ప్రాథమిక పాఠశాల, కాలేజీలను గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని ఖైదీలకు ఏర్పాటు చేసిన వసతుల రించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా మంచి ఆహారం అందిస్తున్నారా..అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, కోర్టు సిబ్బంది వరలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ మధు ఉన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి



ర్యాలీకి హాజరైన డ్వాక్రా మహిళలు

మార్కాపురం: వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, డ్వాక్రా గ్రూప్ మహిళలు గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి చిరుధాన్యాల సాగు ప్రాధాన్యం వివరించి సాగును ప్రోత్సహించేలా కృషి చేయాలని ఏపీఎం రమేష్‌బాబు కోరారు. పట్టణంలోని డ్వాక్రా బజారులో ప్రధాన మంత్రి నిర్వహించిన మిల్లెట్ మహోత్సవాన్ని టీవీలో చూసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో మంచి లాభలు వచ్చే సజ్జలు, రాగులు, ఆరికలు, జొన్నలు సాగు చేయించాలన్నారు. సీసీ మనోకుమారి, నాగభూషణం, సులోచన, సిబ్బంది పాల్గొన్నారు.

నో స్కూల్..బ్యాగ్ డేతో ఉల్లాసంగా విద్యార్థులు

కంభం: స్థానిక రంగా వీధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల, బోర్డు స్కూల్లో శనివారం నో స్కూల్ బ్యాగ్‌డే కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బషీరున్, వరికుంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాల బరువులు, బ్యాగుల మోత లేకుండా ఆటపాటలతో సృజనాత్మకంగా అడుగులు వేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు రోజంతా ఉల్లాసంగా ఉంటారన్నారు. సీఆర్పీ మురళి, ఉపాధ్యాయులు మురళి, గఫూర్, నాగమణి పాల్గొన్నారు.

సుబ్బులుకు ఎమ్మెల్యే కరణం నివాళి



సుబ్బులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కరణం, మద్దిశెట్టి రవీంద్ర

తాళ్లూరు: మండలంలోని శివరామపురం మాజీ సర్పంచి నిశంకం సుబ్బులు గ్రామాభివృద్ధిలో, పార్టీ అభ్యున్నతికి విశేష కృషి చేశారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర అన్నారు. శివరామపురంలో శనివారం ఆమె సంస్మరణ సభ నిర్వహించారు. సుబ్బులు చిత్రపటాకి వారితో పాటు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్‌పీ నాగార్జునరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఐ.వేణుగోపాల్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, సర్పంచ్‌లు వలి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి యలమందారెడ్డి, సొసైటీ చైర్మన్ శనివారపు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎల్‌జీ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ జీఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు దేవదానం, విష్ణు నివాళులర్పించారు. ఆమె కుమారుడు హనుమంతరావు, భర్త వెంకటేశ్వర్లును నాయకులు పరామర్శించారు.

వైభవంగా రామలింగేశ్వరుడి తిరునాళ్ల



మట్టి శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న నాగసాధువులు



ఉప్పుమాగులూరు తిరునాళ్లలో ఏర్పాటు చేసిన ప్రభ

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలో వేంచేసిఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి శివునికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అన్నదానం చేపట్టారు. భారీ ఎలక్ట్రిక్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం హిమాలయ నాగ సాధువుల బృందంతో వివిధరకాల పత్ర, పుష్ప, ఫల రసాలతో మూడు అడుగుల మట్టి శివ లింగానికి గంటపాటు అభిషేకం చేశారు. స్వామి జ్ఞాన ప్రసన్నగిరిచే ఢమరుక ఘంట, శంఖారావంతో హరహర మహదేవ శంభోశంకర అంటూ శివనామ స్మరణతో కై లస వాతావరణంలో రుద్రాభిషేకం, భస్మాభిషేకం హరతులు, నివేదనలు చేపట్టారు. బల్లికురవ ఎస్సై వీ. వేమన తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ చెక్కు అందజేత



చెక్ అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మార్కాపురం: యూటీఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ జనవరి 31న మృతి చెందిన నంద్యాల వీరకుమార్ కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం కింద మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును జిల్లా అధ్యక్ష, కార్యదర్శు ఓవి వీరారెడ్డి, వెన్నా వెంకటరెడ్డిలు అందించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దండా వెంకటరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరకుమార్ కుటుంబ సభ్యులు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకానికి 5 వేల విరాళం ప్రకటించారు.

పట్టణ ప్రధాన కార్యదర్శిగా శేషయోగయ్య

యూటీఎఫ్ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా శేషయోగయ్యను ఎన్నుకునట్లు గౌరవ అధ్యక్షుడు తాటిపర్తి సత్యనారాయణరెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా దండా వెంకటరెడ్డి, సహ అధ్యక్షులుగా పిన్నిక ప్రసాద్, బేబిరాణి, కోశాధికారిగా ఎం.శ్రీనివాసనాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు తెలిపారు. సీనియర్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, అమీర్‌బాషా, కొండయ్య, వినోద్‌కుమార్, పెద్దారవీడు మండల నాయకులు పాల్గొన్నారు.

పొలంబడితో రైతులకు మేలు



శనగ రైతులకు సూచనలందిస్తున్న ఉద్యానశాఖ సిబ్బంది

చీరాల టౌన్: అన్నదాతలకు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట దిగుబడులు పెంచేలా సూచనలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను తెలియజేసేందుకు నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ పొలంబడితో రైతులకు మేలు జరుగుతుందని ఆర్‌బీకే చైర్మన్ కే.రమణారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా శనగ పంటలను వ్యవసాయాధికారులు, ఉద్యానశాఖ ఉద్యోగులు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. శనగ పంట సాగులో ఖర్చులు తగ్గించుకుని సేంద్రీయ ఎరువులను వినియోగించడం వలన పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అధికారి మేరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవిత, గ్రామంలో రైతులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు మరిన్ని వైద్య సేవలందించాలి

గిద్దలూరు రూరల్: మాజీ సైనికులకు మరిన్ని వైద్యసేవలు అందించాలని మాజీ సైనికుల సంఘ నాయకుడు లక్ష్మణ్‌బాబు కోరారు. పట్టణంలోని మాజీ సైనికుల వైద్యశాల ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సైనికుల వైద్యశాలలో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు, మార్కాపురం, కర్నూల్, నంద్యాల ప్రాంతాల్లో అన్ని వసతులతో కూడిన వైద్యశాలలు ఏర్పాటు చేయాలన్నారు. మాజీ సైనికుల సంఘ నాయకులు పాల్గొన్నారు.